లేఅవుట్ స్థలాలు, డబుల్ ఇళ్ల పరిశీలన

రామాయంపేట, అక్టోబరు 10 : పట్టణంలో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న స్థలాలను గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. నాన్ డీటీసీపీకి సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్థలాలను సందర్శించారు. కేసీఆర్ కాలనీలో గతేడాది డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయగా మిగిలిన మరో 50 ఇళ్లను పరిశీలించారు. త్వరలోనే వాటిని అర్హులకు అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రజిని, ఆర్‌ఐ రాజులు ఉన్నారు.

పూల జాతర

అంబరాన్నంటిన సద్దుల సంబురం





నర్సాపూర్‌లో..



కల్హేర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మెదక్ బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న మహిళలు

పండుగ వేళ.. ఆఫర్ల వెల్లువ

- వాహనాల మార్కెట్‌కు దసరా కళ
- కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ప్రత్యేక తగ్గింపు
- కిటకిలాడుతున్న షోరూంలు



మెదక్ పట్టణంలోని న్యూ వాసు హీరో షోరూం ఎదుట ఆఫర్లతో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బైక్‌లు

మెదక్ అర్బన్, అక్టోబరు 10: బతుకమ్మ, దసరా పండుగతో వాహన షోరూంలలో సందడి మొదలైంది. విజయదశమి, దీపావళి నేపథ్యంలో విక్రయాలు పెంచుకునేందుకు వాహన కంపెనీలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. సులభ వాయిదాలపై కొనుగోలుకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. జీరో పేమెంట్‌తో బైక్ కొనే అవకాశం ఇస్తున్నాయి. గిఫ్ట్ ఆఫర్లు, డిస్కౌంట్లనూ ప్రకటిస్తున్నాయి. వాహన కంపెనీలతోపాటు వినియోగదారుడిని ఆకట్టుకోవడానికి డీలర్లు ఆఫర్లు ఇస్తున్నారు. ముఖ్యంగాహీరో, టీవీఎస్, బజాజ్, యమహా తదితర కంపెనీలు వివిధ రకాల ఆఫర్లను పండుగ సందర్భంగా ప్రకటించాయి. ప్రతీ బైక్ కొనుగోలుపై రూ.5 వేల వరకు తగ్గింపు ఇస్తున్నారు. దీంతో వినియోగదారులు కొత్త బైక్‌లు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

జోరుగా ద్విచక్ర వాహనాల విక్రయాలు



ఈ ఏడాది ద్విచక్ర వాహనాల అమ్మకాలు ఊపందుకున్నాయి. హీరో ఎక్స్‌ట్రీమ్125ఆర్, ఎక్స్‌ట్రీమ్ 160ఆర్, గ్లామర్, ప్యాషన్ ప్లస్, వీడాప్లస్ ఎలక్ట్రికల్ బైక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతీ బైక్‌పై రూ.5 వేల వరకు డిస్కౌండ్, జీరో డౌన్ పేమెంట్‌పై రుణ సదుపాయం ఇస్తున్నాం. రెండు రోజుల్లో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది. గతేడాదితో పోలిస్తే ఈసారి ఆఫర్లతోపాటు కొత్త బైక్‌లతో విక్రయాలు బాగా పెరిగాయి.

- బండ నరేందర్,
న్యూవాసు హీరో మోటార్స్ యజమాని

ఘనంగా ఆయుధ పూజ



ఆయుధ పూజ చేస్తున్నఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 10 : దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా సాయుధ పోలీసు కార్యాలయంలో గురువారం ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ దంపతులు, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు దంపతులు ఈ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్‌ఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

- కలెక్టర్ క్రాంతి వల్లూరు

పుల్‌కల్, అక్టోబరు 10 : వారం రోజుల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేస్తారని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వెల్లడించారు. గురువారం స్కూల్ నిర్మాణం కోసం పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామ శివారులో నీటి పారుదల శాఖకు కేటాయించిన 417 సర్వే నంబరులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలాన్ని నీటి పారుదల శాఖకు కాకుండా నిరుపేదలు, ఇతరులెవరికైనా కేటాయించారా అని స్థానిక తహసీల్దారు కృష్ణను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణ, ఇతర రెవెన్యూ, రోడ్లు, భవనాలు, సర్వే అధికారులున్నారు.

కిడ్నాప్‌కు గురైన శిశువు లభ్యం

- హైదరాబాద్‌లోని బోరబండలో గుర్తింపు
- పోలీసుల అదుపులో నిందితులు



శిశువు

సంగారెడ్డి అర్బన్, అక్టోబర్ 10 : సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కిడ్నాప్‌కు గురైన పసికందు ఆచూకీ లభ్యమైంది. పిల్లలు లేరన్న కారణంగా తాము చిన్నారిని ఎత్తుకొచ్చినట్లు నిందితులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. హైదరాబాద్ బోరబండ ప్రాంతంలో నిందితులను గుర్తించి చిన్నారిని క్షేమంగా తల్లి ఒడికి చేర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో మనూర్ మండలం దూదికొండ గ్రామానికి చెందిన నసీమా(25)కు జన్మించిన ఆడబిడ్డ బుధవారం కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. ఇద్దరు స్కూటీ, ఇద్దరు ఆటోలో మొత్తం నలుగురు మహిళలు వచ్చి కిడ్నాప్ చేసినట్టు సీసీటీవీ ఫుటేజ్‌లో పోలీసులు గుర్తించారు. వీటి ఆధారంగా ఎస్పీ రూపేష్ పది పోలీసులు బృందాలు ఏర్పాటు చేశారు. బృందాలుగా విడిపోయిన పోలీసులు సీసీ కెమెరాకు చిక్కిన స్కూటీ నంబర్ ఆధారంగా గాలించగా హైదరాబాద్‌లోని బోరబండలో ఉన్నట్టు గుర్తించారు. ఆ క్రమంలో స్కూటీతో పాటు కిడ్నాప్ చేసిన ఓ మహిళను పట్టుకుని ఆమె నుంచి శిశువును స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు మహిళ కిడ్నాపర్ల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. అర్ధరాత్రి వరకు మిగతా ముగ్గురుని కూడా పట్టుకునే అవకాశం ఉంది. లభ్యమైన పసికందును గురువారం రాత్రి తల్లి వద్దకు చేర్చగా, కిడ్నాప్ చేసిన నిందితులను గురువారం మీడియా ఎదుట ప్రవేశపెట్టే అవకాశం ఉందని పోలీసు అధికార వర్గాలు తెలిపాయి. తమకు పిల్లలు లేరన్న కారణంతోనే పసికందును కిడ్నాప్ చేసినట్టు వారు పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. 28 గంటల్లోనే పసికందు కిడ్నాప్ ఘటనను పోలీసులు చేధించడం పట్ల పోలీసులకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజ్ చేసిన పరిశ్రమలో చోరీ

● సామగ్రిని తరలిస్తున్న వాహనాల పట్టివేత

మనోహరాబాద్, అక్టోబర్ 10: సీజ్ చేసిన పరిశ్రమ నుంచి చోరీ చేసిన ఇనుప సామగ్రిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని బీఎస్ స్టీల్ పరిశ్రమను తీసుకున్న లోన్ కట్టకపోవడంతో ఎస్‌బీఐ సీజ్ చేసింది. అయితే బుధవారం రాత్రి కొంతమంది దొంగలు ఆ పరిశ్రమలోకి చొరబడి క్రేన్ సాయంతో ఏకంగా ఒక టిప్పర్ నిండా ఇనుప మిషనరీ సామగ్రి నింపి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించగా గమనించిన దొంగలు వాహనాలను అక్కడే వదిలేసి పరారయ్యారు. దీంతో లోడుతో ఉన్న టిప్పర్, క్రేన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత బ్యాంక్‌కు సమాచారం ఇవ్వగా ఉద్యోగి రవీందర్ వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే గత మూడు సంవత్సరాల నుంచి ఈ పరిశ్రమలో చోరీ జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటివరకు ఈ పరిశ్రమ నుంచి సుమారు రూ.4 కోట్ల సామగ్రి దుండగులు తస్కరించినట్లు పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు.




పోలీసులు పట్టుకున్న టిప్పర్, క్రేన్

చిట్కుల్‌లో బతుకమ్మ వేడుకలు




బతుకమ్మతో నీలం మధు, ఆయన సతీమణి కవిత

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 10 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక, ప్రకృతిని, పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం చిట్కుల్‌లో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతా గ్రామగ్రామాన అక్కచెల్లెలు సంబరంగా బతుకమ్మ పండుగ జరుపుకుంటున్నారన్నారు. ఆ గౌరీమాత ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మహిళలతో కలిసి నీలం మధు సతీమణి నీలం కవిత బతుకమ్మ ఆడారు.



నర్సాపూర్ పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు






బతుకమ్మలతో చెరువు కట్టపైకి చేరుకుంటున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి

సద్దుల బతుకమ్మ వేడుకల్లో నిర్మలాజగ్గారెడ్డి, జయారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 10: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో గురువారం సాయంత్రం సద్దుల బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పట్టణంలోని అన్ని వీధుల్లో బతుకమ్మ నిర్వహించారు. పట్టణమంతా విద్యుత్ దీపాల అలంకరణతో వెలుగులీనింది. కింది బజార్ మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై వందలాది మంది మహిళలు వేడుకలు జరుపుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సొంత ఖర్చులతో విద్యుత్‌దీపాలు, డీజేలను ఏర్పాటు చేయించారు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు. చెరువుకట్టపై మూడున్నర టన్నుల పూలతో 26 అడుగుల బతుకమ్మను తయారుచేశారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కూతురు జయారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు పసుపుకుంకుమను ఇస్తూ వేడుకలకు ఆహ్వానించారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆటపాటలతో ఉత్సాహాన్ని నింపారు. ఓవైపు భారీ వర్షం కురుస్తున్న మహిళలు తడుస్తూనే ఆటపాటలను కొనసాగించారు.










మనోహరాబాద్ మండలం ధర్మరాజ్‌పల్లిలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఫాక్స్ చైర్మన్

మెదక్ పట్టణంలోని కోదండ రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూల జాతర

సద్దుల బతుకమ్మ సంబురం అంబరాన్నితాకింది. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం వేళ బతుకమ్మలన్నీ ఒక్కచేట చేర్చి పాటలు పాడుతూ లయబద్ధంగా ఆడారు. అనంతరం గంగమ్మ ఒడికి చేర్చారు. 'పోయిరా బతుకమ్మ, మళ్లొచ్చే యేడు తిరిగి రా బతుకమ్మ' అంటూ పాటలతో వేడుకున్నారు. వెంట తెచ్చుకున్న ప్రసాదాలు పరస్పరం పంచిపెట్టుకున్నారు. సాయంత్రం వేళ సంగారెడ్డి, మెదక్‌తో పాటు పలు చోట్ల వర్షం పడడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

-న్యూస్‌నెట్‌వర్క్

రవాణాశాఖ సేవలతో ప్రజలకు మేలు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 10: వారానికి రెండురోజులు రవాణా శాఖ సేవలందించేందుకు ఖేడ్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో నియోజకవర్గ వాసులకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం రైతుబజార్‌లో రవాణాశాఖ కార్యాలయ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటివరకు రవాణాశాఖకు సంబంధించిన ఏ అవసరం వచ్చినా వ్యయప్రయాసాలకు ఓర్చి జహీరాబాద్ వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, బీమా, ఫిట్‌నెస్ తదితర సేవలను నారాయణఖేడ్‌లోనే పొందవచ్చన్నారు. త్వరలో ఇక్కడే శాశ్వతంగా సేవలందించేలా ఎంవీఐ కార్యాలయాన్ని మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ, ఎంవీఐ వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, నర్సింహులు, రామక్రిష్ణ, సద్దాం, హన్మాండ్లు, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చిచ్చుకు యువకుడి బలి

- ఫోన్ పగలడంపై స్నేహితుల మధ్య గొడవ
- మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య

పుల్‌కల్, అక్టోబరు 10: సెల్‌ఫోన్ పెట్టిన చిచ్చుకు యువకుడు బలి అయిన సంఘటన చౌటకూర్ మండలం లింగంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ పాటిల్ కాంత్రికుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాదిగ రాజు (17) ఇంటి పక్కనే ఉండే మాదిగ దీపక్ స్నేహితులు. వీరిద్దరు బుధవారం మధ్యాహ్నం సైకిల్‌పై తమ వ్యవసాయ పొలానికి వెళ్తుండగా మాదిగ రాజు సెల్‌ఫోన్ కిందపడి పగిలిపోయింది. నీ వల్లనే తన ఫోన్ పగిలిందని, తన తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలంటూ దీపక్‌తో రాజు గొడవపడి చేయిచేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని దీపక్ తన తాత లింగమయ్యకు చెప్పగా, ఇద్దరు కలసి రాజు ఇంటికి వెళ్లి దూషిస్తూ దాడి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన మాదిగ రాజు ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న మాదిగ లింగమయ్య కుటుంబ సభ్యులందరూ రాత్రికి రాత్రే ఎక్కడికో పరారయ్యారు. సంగారెడ్డి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకువెళ్లగా ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాజు మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు గురువారం రాత్రి వరకు మృతదేహంతో నిరసన తెలిపారు. ఎస్‌ఐ జోక్యంతో చేసుకుని నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్‌పై వెళ్తుండగా ఫిట్స్.. వ్యక్తి మృతి

మనోహరాబాద్, అక్టోబరు 10: సైకిల్ తొక్కుతుండగా ఫిట్స్ రావడంతో కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు పాపన్నపేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన భూతిపురం రవి(40)ని భార్య మూడేళ్ల క్రితం వదిలిపెట్టి పోయింది. దీంతో అతడు తన ముగ్గురు పిల్లలను హాస్టల్‌లో వదిలివేశాడు. అప్పటి నుంచి మెదక్ చర్చిలో నివసముంటున్నాడు. బుధవారం రాత్రి మేడ్చల్ నుంచి సైకిల్‌పై మనోహరాబాద్ మండలం కాళ్లకాల్ శివారులోని 44వ జాతీయ రహదారి గుండా వెళ్తుండగా ఫిట్స్ రావడంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సోదరుడు గంగారాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


అనిల్(ఫైల్)

చేగుంట, అక్టోబరు 10: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన చేగుంట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన గడ్డమీది అనిల్(21) తన స్నేహితుడు సమీర్‌తో కలిసి మండల కేంద్రంలోని మక్కరాజిపేట్ రోడ్డులోని తన సొంత స్క్రాప్ దుకాణానికి గురువారం వెళ్లారు. అందులోని ఇనుప నిచ్చెనను వారు బయటకు తీసుకువస్తుండగా షాపుపైన ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో ఇద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. అనిల్‌ను నార్సింగి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్ర గాయాలైన సమీర్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


జామీల్(ఫైల్)

మనోహరాబాద్, అక్టోబరు 10: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలానికి చెందిన అబ్దుల్ జామీల్(32) కొంతకాలంగా భార్యతో కలిసి ఘట్‌కేసర్ మండలం కీసరలో ఉంటూ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 4న మనోహరాబాద్‌లోని సొంత ఇంటికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమవతమవుతున్న జామీల్ సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి వెంటనే సూరారం నారాయణ ఆసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయత్రం మృతిచెందాడు. అన్న అబ్దుల్ ఖైగౌమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైకు ఢీకొని పాదచారుడి మృతి

శివ్వంపేట, అక్టోబరు 10 : బైకు ఢీకొన్న ఘటనలో పాదాచారుడు మృతి చెందిన సంఘటన చిన్నగొట్టుముక్ల చౌరస్తాలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం మండల పరిధిలోని చిన్న గొట్టుముక్ల చౌరస్తాలో అదే గ్రామానికి చెందిన వడ్డె సుధాకర్(22) బుధవారం రాత్రి చౌరస్తా నుంచి కొత్త ప్లాట్‌లో ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా చెన్నాపూర్‌కు చెందిన మన్నె రమేష్ ద్విచక్ర వాహనంపై వస్తూ వెనుక నుంచి బలంగా ఢీకొట్టగా సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి నాగేష్ ఫిర్యాదు మేరకు మన్నె రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైపాల్‌రెడ్డి తెలిపారు.

పోకల్ సీట్స్ కాపాడుకోవడానికి ఎస్‌ఈ పైనే దుష్ప్రచారం


విలేకరులతో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

తూప్రాన్, అక్టోబరు 10: మెదక్ విద్యుత్ సర్కిల్ పరిధిలో కొన్నేళ్లుగా ఎక్స్‌పెండేచర్ సీటులో కొనసాగుతూ తిరిగి అదే సీటులో కొనసాగాలన్న ఉద్దేశంతో సంబంధిత ఎస్‌ఈపైన దుష్ప్రచారం చేస్తున్నట్లు తూప్రాన్ విద్యుత్ డివిజన్ బీసీ సంఘం, టీఆర్‌వీకేఎస్, 327, 1104 సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరులతో మాట్లాడుతూ సీఎండీ ఆదేశాల ప్రకారం.. ప్రస్తుత బదిలీల్లో పోకల్ (ఎక్స్‌పెండేచర్) నుంచి నాన్ పోకల్ (రెవెన్యూ)కు, నాన్ పోకల్ నుంచి పోకల్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇవ్వాల్సి ఉన్నదన్నారు. ఇలా జరిగే బదిలీల నిబంధనలు అడ్డుకోడానికి ఎస్‌ఈపైన దుష్ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. ఆరోపణలు చేస్తూ బదిలీ ప్రక్రియను అడ్డుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తూప్రాన్ విద్యుత్ డివిజన్ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఆరోపించారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు శ్రీశైలం, వెంకటయ్య, సత్యానారాయణ, బాలయ్య, విజేందర్, సతీష్, బలరాం, హరి పాల్గొన్నారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

కొండాపూర్, అక్టోబరు 10: మండల పరిధిలోని గుంతపల్లిలో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, ఆ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం డీఎల్పీవోకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన డీఎల్పీవో అనిత గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి లేరా అని ప్రశ్నించగా బతుకమ్మ పండుగ, ఎంపీవో సిక్ లీవ్ సెలవులో ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. గ్రామ వీధుల్లో తిరిగి గ్రామస్థుల సమస్యలపై ఆరాతీసి ఆర్‌డబ్ల్యూజేఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ తనిఖీలో నాయబ్ తహసీల్దార్ ప్రదీప్, మల్లేపల్లి జీపీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

15న సదరం స్లాట్ బుకింగ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 10: దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్లు 15న కేటాయించన్నుట్లు పేర్కొన్నారు. మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంపుకు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆమె కోరారు.

చిన్నముబారక్‌పూర్‌కు గ్రామపంచాయతీ భవనం మంజూరు

కల్హేర్, అక్టోబరు 10: సిర్గాపూర్ మండల పరిధిలోని చిన్నముబారక్‌పూర్‌కు గ్రామపంచాయతీ భవనం మంజూరు చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీచేశారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.20 లక్షలతో నిర్మించనున్నారు. భవనం మంజూరు చేయించిన జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డికి మాజీ సర్పంచ్ స్వప్నమధు ధన్యవాదాలు తెలిపారు.